క్లుప్తంగా

ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరా


వేగేశ్వరంలో పంచాయతీ ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామంలో నీటిని సరఫరా చేసే మోటార్ కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకుపోవడంతో బోరు పాడైంది. దీనికితోడు తాళ్లపూడి నుంచి గోదావరి నీరు సరఫరా చేసే మోటార్లు కూడా పాడైపోవడంతో.. మంచి నీటి సమస్య గ్రామంలో తీవ్రమైంది. ఈ క్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు తక్షణ చర్యలు చేపట్టారు. నీటి ఇబ్బందులు లేకుండా యుద్ధప్రాతిపదికన రెండు రోజులుగా వాటర్ ట్యాంక్ ద్వారా మంచి నీటి సరఫరా చేస్తున్నారు. కొత్త మోటార్ కూడా ఏర్పాటు చేశారు. ఆయా చర్యలతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రికి విలువైన సామగ్రి అందజేత


గోపాలపురం సీహెచ్‌సీకి సామగ్రిని అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

గోపాలపురం: పేద ప్రజలకు సేవలందించడంలో మేము సైతం అంటూ ముందుకు వచ్చిన దాతల సహకారం మరువలేనిదని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వాస్పత్రిలో వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. జంగారెడ్డిగూడెం నవభారత్ కంపెనీ యాజమాన్యం ఏఎస్ చౌదరి ఫౌండేషన్ రూ.8 లక్షల విలువైన సామగ్రిని శుక్రవారం ఆస్పత్రికి అందజేశారు. అలాగే రాజమహేంద్రవరం రెడ్ క్రాస్ సొసైటీ వారు రూ.8 లక్షల విలువైన జనరేటర్, దేవరపల్లి మండలం పరమేశు బయోటెక్ కంపెనీవారు రూ.14 లక్షలతో ఆస్పత్రిలో ఎక్స్‌రే వసతులు ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, కంపెనీ మేనేజర్లు జి లీలాకృష్ణ, అనిశెట్టి వీర్రాజు, వైద్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు బీసీల ఆత్మీయ సమ్మేళనం

చాగల్లు: శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపంలో శనివారం జరిగే బీసీల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ సభకు బీసీ ప్రముఖ నేతలు, మంత్రులు హాజరవుతారని చెప్పారు. మండలంలో బీసీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. గతంలో ఎన్నో ఏళ్లుగా పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, వారి సంక్షేమానికి, రాజ్యాధికారానికి ఎవరూ ప్రయత్నించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు గుర్తింపు ఇచ్చి, వారిని రాజ్యాధికారంలో భాగం చేశారన్నారు.

సాయుధ బలగాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

నిడదవోలు : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నిడదవోలు సర్కిల్ పోలీసు బృందాలు, కేంద్ర సాయుధ బలగాలు పట్టణంలో శుక్రవారం కవాతు నిర్వహించాయి. తిమ్మరాజుపాలెం గ్రామం నుంచి పట్టణంలో గణపతి సెంటర్, గణేష్‌చౌక్ సెంటర్, పోలీస్‌స్టేషన్, గాంధీ బొమ్మ సెంటర్, చర్చిపేట సెంటర్ల మీదుగా కవాతు సాగింది. కొవ్వూరు డీఎస్పీ రామారావు మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలీసు శాఖ అండగా నిలుస్తోందన్నారు. నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్సై పులపా అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

నిడదవోలు రూరల్: రావిమెట్ల గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ శుక్రవారం తెలిపారు. వారి వద్ద రూ.2 వేల నగదుతో పాటు, కోడిపుంజు, కత్తిని స్వాధీనపర్చుకున్నట్టు చెప్పారు.

జూదరుల అరెస్టు

కొవ్వూరు: మద్దూరు గ్రామ శివారున పేకాట ఆడుతున్న ఏడుగురిని శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశామని హెచ్‌సీ కె.శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.



అన్నవరప్పాడులో విశ్వేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న పండితులు, అభిషేకానికి భారీగా హాజరైన దంపతులు

శివోహం

- శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- రాత్రి ఒంటి గంట నుంచే స్వామివారికి అభిషేకాలు
- అన్న సమారాధనలు, భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ

పెరవలి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. మాస శివరాత్రి, త్రయోదశి, శుక్రవారం కలిసి రావటంతో వేలాది మంది భక్తులు అర్ధరాత్రి ఒంటి గంట నుంచే ఆలయాలకు బారులు తీరారు. కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, పెరవలి, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, కడింపాడు గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అన్నవరప్పాడు మల్లేశ్వరం, తీపర్రు, ఖండవల్లి, ముక్కామల గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నవరప్పాడులో ఉన్న విశ్వేశ్వరస్వామికి 312 మంది దంపతులలో ఒకేసారి అభిషేకాలు జరిపారు. మల్లేశ్వరంలో స్వయంభూ కపిల మల్లేశ్వరస్వామి, ముక్కామలలో ఉమా సోమేశ్వరస్వామి, తీపర్రులో రాజరాజ నరేంద్ర స్వామి వందలాది మంది దంపతులతో అభిషేకాలు నిర్వహించారు. తీపర్రులో మ్యూజికల్ నైట్, వీరభద్రుని సంబరం, రథోత్సవం నిర్వహించారు. యువతీయువకులు అధిక సంఖ్యలో పాల్గొని, రథ శిఖరంపై అరటిపండ్లు విసిరారు. తీర్థంలో రకరకాల దుకాణాలు, జెయింట్‌వీల్, రంగులరాట్నం ఏర్పాటుచేశారు. మల్లేశ్వరంలో రథోత్సవం నిర్వహించగా, భక్తులకు భోజన వసతి కల్పించారు. అన్నవరప్పాడులో 30 వేల మంది, తీపర్రులో 20 వేలు, మల్లేశ్వరంలో 7 వేల మంది భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


వేగేశ్వరపురం శివాలయం వద్ద స్వామివారికి అభిషేకాలు


పాలంగి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, సుమలత దంపతులు


మల్లేశ్వరంలో కపిల మల్లేశ్వర స్వామికి క్షీరాభిషేకం


తీపర్రులో స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు


అన్నవరప్పాడులో స్పటిక లింగానికి అభిషేకం చేస్తున్న పండితుడు

స్పటిక లింగ దర్శనం

అన్నవరప్పాడులో జాతీయ రహదారి చెంతనున్న విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పటిక లింగాన్ని 50 వేల మంది దర్శించుకున్నారు. తెల్లవారుజాము 4 గంటలకు ప్రారంభమైన దర్శనం రాత్రి ఒంటి గంట వరకు కొనసాగింది. వేలాది మంది తరలిరావటంతో జాతీయ రహదారిపై కిలోమీటరు మేర క్యూలైన్ పాటించారు.

గోదావరిలో పుణ్యస్నానాలు

తాళ్లపూడి: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శివున్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తాళ్లపూడిలోని పార్వతి సహిత ఉమామహేశ్వర ఆలయంలో, ప్రక్కిలంకలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, లక్ష తులసీ పూజలు నిర్వహించారు. లింగోద్భవ దర్శనం ఏర్పాటు చేశారు. వేగేశ్వరపురంలోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో, అన్నదేవరపేటలోని సంగమేశ్వర ఆలయంలోను, తిరుగుమెట్ట, బల్లిపాడు, పెద్దేవం, మలకపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. సౌరయాగంలో భాగంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టిసీమ క్షేత్రాన్ని సందర్శించిన భక్తులకు తాడిపూడి, ప్రక్కిలంక, తాళ్లపూడి, వేగేశ్వరపురం, బల్లిపాడు గ్రామాల్లో దాతల సహకారంతో పులిహోర, మజ్జిగ, భోజనాలను ఏర్పాటు చేశారు.

స్వామివారికి ప్రత్యేకాలంకరణ

ఉండ్రాజవరం : మండలంలోని అనేక గ్రామాల్లో శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. పాలంగిలో బాలా త్రిపురసుందరీ దేవి సమేత శ్రీరామలింగేశ్వర స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, సుమలత దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయ అర్చకులు వి.శేషురఘుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధనలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దొడ్డా సూర్యానారాయణ, ఈఓ ఎంవీ రామయ్య ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, ఏఎంసీ వైస్ చైర్మన్ వేలిచేటి జానకీరామయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఉండ్రాజవరంలోని బాలత్రిపుర సుందరీదేవి సమేత గోకర్ణేశ్వర స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బూరుగుపల్లి సుబ్బారావు పాల్గొన్నారు. వెలగదుర్రులో స్వామివారి రథోత్సవం జరిగింది. పసలపూడి రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

వేగిలింగేశ్వరుని కల్యాణం

నల్లజర్ల: అనంతపల్లిలోని వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం శుక్రవారం తెల్లవారుఝామున వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు హాజరై, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చిక్కాల నాగేశ్వరరావు, ఈఓ మద్దిరాల లక్ష్మీశరణ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ ప్రత్తి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. రాత్రి రథంపై స్వామివారిని ఊరేగించారు. తెలికిచెర్లలో ప్రకటేశ్వరాలయం, నల్లజర్లలో ఉమాచంద్రమౌళీశ్వర ఆలయం, పోతవరం, శింగరాజుపాలెం, దూబచర్ల–ఘంటావారిగూడెం మధ్యనున్న లలితా కామేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

గోలింగేశ్వర ఆలయానికి
పోటెత్తిన భక్తులు

నిడదవోలు: హరిహర మహదేవా.. శంభోశంకర అంటూ భక్తుల హరినామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పట్టణంలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ చినకాశి రేవులో వేకువజామున భక్తులు అధికంగా తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడ నుండి శివ నామాన్ని స్మరిస్తూ శివాలయాలకు తరలివెళ్లారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వర స్వామి ఆలయంలో వేకువజామున నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటుచేశారు. పుష్పాలంకరణతో దర్శనమిస్తున్న గోలింగేశ్వర, రాజరాజేశ్వర అమ్మవార్ల దర్శనాన్ని కల్పించారు. స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, లక్షపత్రి పూజ, లక్షకుంకుమార్చనలు, నిత్య అభిషేకాలు జరిగాయి. ఈఓ నామా సూర్యప్రకాశరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిడదవోలు పరిసర ప్రాంతాల నుంచి సుమారు పది వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సై పులపా అప్పారావు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.


నిడదవోలులో గోలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సోమేశ్వరస్వామి వారి ఆలయంలో..

పట్టణంలో బాలాత్రిపుర సుందరి సహిత సోమేశ్వరస్వామి ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, లలితా సహస్ర నామాలతో లక్ష కుంకుమార్చనలు, వేద పారాయణాలు, రుద్రహోమాలు వైభవంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కేదారిశెట్టి రవికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, మంచినీరు సరఫరా చేశారు.

భక్తజన సంద్రంగా గోష్పాద క్షేత్రం


గోష్పాద క్షేత్రంలో గోదావరిలో పుణ్యస్నానాలకు తరలివచ్చిన భక్తులు

కొవ్వూరు: గోష్పాదక్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి సుందరేశ్వరస్వామి దర్శించుకున్నారు. పట్టణంలో శివాలయా లు శివ నామస్మరణతో మార్మోగాయి. పురాతన పాతూరు ఉమా చోడేశ్వర స్వామి ఆలయం, సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వర స్వామి, ఏటిగట్టుపై ఉన్న పంచాయతన శివాలయంలోను ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వాడపల్లిలో అనంత భోగేశ్వస్వామి రథోత్సవం, మద్దూరులో రాజరాజేశ్వరీ సమేత మల్లేశ్వరస్వామి ప్రబల సేవ నిర్వహించారు.

చాగల్లు: శివరాత్రి సందర్భంగా స్థానిక రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఊనగట్ల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. మార్కొండపాడు, చిక్కాల, కలవలపల్లి, నందిగంపాడు, దారవరం, మల్లవరం గ్రామాల్లోను శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి.

దేవరపల్లి: మండలంలో పలు గ్రామాల్లోని శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. దేవరపల్లిలో పార్వతి సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ ఏర్పడింది. షిర్డీ సాయిబాబా మందిరం, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, విజయ దుర్గాదేవి అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పల్లంట్లలో రాజరాజేశ్వరీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం భక్తుల శివ నామస్మరణతో మార్మోగింది. గురువారం రాత్రి స్వామివారి కల్యాణం జరిగింది. గౌరీపట్నం, దుద్దుకూరు, కృష్ణంపాలెం, యర్నగూడెం, త్యాజంపూడి, యాదవోలు, లక్ష్మీపురం, బందపురం, చిన్నాయగూడెం, రామన్నపాలెం గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు జరిగాయి.

నిడదవోలు రూరల్: కాటకోటేశ్వరం గ్రామంలో ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామికి 61వ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని, పార్వతీదేవీని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు నిర్వహించారు. మ్యూజికల్ నైట్, కోలాటం ప్రదర్శించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కోసూరి భాస్కరరావు పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. స్వామివారిని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సతీమణి సుమలత, తనయుడు వరుణ్‌సాయి, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటుపల్లి రామచంద్రరావు, కోసూరి అప్పారావు, యాళ్ల రామారావు దర్శించుకున్నారు. కంసాలిపాలెం గ్రామంలో ఉన్న అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి శివ పంచాయతన ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. సమిశ్రగూడెం పర్వతవర్ధిని ఉమారామలింగేశ్వర స్వామివారికి కల్యాణం, లక్ష దీపోత్సవం నిర్వహించారు. రావిమెట్ల సోమేశ్వరస్వామి, పందలపర్రు, గోపవరం విఘ్నేశ్వరం గ్రామాల్లోని శివాలయాల వద్ద భక్తులు పోటెత్తారు.


గోష్పాద క్షేత్రంలో సుందరేశ్వరస్వామికి అభిషేకాలు చేస్నుత్న పండితులు


బ్రాహ్మణగూడెం శివాలయంలో సుందరాలంకరణలో స్వామివారు


దేవరపల్లిలో ఉమారామలింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

మహిళలే మహారాణులు

హోం మంత్రి తానేటి వనిత


గోపాలపురంలో మంత్రి వనితను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

గోపాలపురం: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గోపాలపురంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల మహిళా నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. ప్రతి సంక్షేమ పథకం మహిళలకు కేటాయించి, వారి ఉన్నతికి విశేష కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండల మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, ఐకేపీ మహిళా అధ్యక్షురాలు వింత శ్రావణి, వెంకటలక్ష్మి, గోపాలపురం జెడ్పీటీసీ కాకులపాటి లలిత, మండల మహిళా నాయకులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యం

నల్లజర్ల: మహిళాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధానం ఇస్తోందని, వారిపేరునే పథకాలు అందిస్తున్నట్టు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. శింగరాజుపాలెం గ్రామం నుంచి ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా బృందం మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి, మంత్రికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వనిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, ఓవైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు ఉద్యోగ బాధ్యతలు సమర్థంగా నిర్వర్తిస్తున్నారన్నారు. ప్రతి మహిళ దిశ యాప్‌ను మొబైల్‌లో వినియోగించాలని మంత్రి సూచించినట్టు పావనీకుమారి తెలిపారు.

హోం మంత్రికి శుభాకాంక్షలు

దేవరపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. యర్నగూడెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు నియోజకరవర్గంలోని పలువురు మహిళా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు వామిశెట్టి పావని, యండపల్లి కవిత, అచ్యుత సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడకలు నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యున్నత సేవలు అందిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ్


దొమ్మేరులో సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతులో పాల్గొన్న సబ్ కలెక్టర్, డీఎస్పీ

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్ అన్నారు. శుక్రవారం దొమ్మేరు గ్రామంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో గ్రామ ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. డీఎస్పీ కేసీహెచ్ రామారావుతో కలిసి కవాతులో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడం కోసం ఓటు విలువ ప్రాధాన్యాన్ని తెలుపుతున్నామన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో భయాందోళనకు లోను కావద్దని డీఎస్పీ కేసీహెచ్ రామారావు సూచించారు. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఇతర సిబ్బంది ఈ కవాతులో పాల్గొన్నారు.

నిరుపేదలకు నెరవేరిన సొంతింటి కల

ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు

పెరవలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలం, ఇళ్లు లేని నిరుపేద కుటుంబం అనేది ఉండరాదనే లక్ష్యంతో పనిచేశామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పెరవలిలోని దీపికా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం అన్నవరప్పాడు, మల్లేశ్వరం, పిట్టల వేమవరం, ఖండవల్లి, ముక్కామల, నల్లాకులవారిపాలెం, కాపవరం, పెరవలి, అజ్జరం, కాకరపర్రు, తీపర్రు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, కానూరు, నడుపల్లి గ్రామాలకు చెందిన 1,969 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పంపిణీతో కొన్ని గ్రామాలు కొత్తగా వెలిశాయని, నిరుపేదల సొంతింటి కల నెరవేరిందని తెలిపారు. ఈ ప్రభుత్వంలో మంచి జరిగిందంటేనే ఓటు వేయాలని, అలాగని కల్లబొల్లి మాటలు నమ్మవద్దని హితవు పలికారు. టీడీపీ, జనసేన పార్టీలు టిక్కెట్ల కోసం గొడవలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, తహసీల్దార్ డి.సుధ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


పెరవలిలో మహిళలకు భూహక్కు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

గోదావరి ఘాట్లలో పారిశుధ్య చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల పుణ్యస్నానాలు, పూజలు, పిండ ప్రదానాల అనంతరం ఘాట్లలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్టు నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చారన్నారు. కోటిలింగాల, పుష్కర, మార్కండేయ ఘాట్లలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలిపారు. నగరంలో పది ఘాట్లలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వైగ్రామ్ ఘాట్, సుబ్బయ్యమ్మ ఘాట్‌లలో స్నానాల ఆచరించేందుకు అనుమతులు లేవన్నారు.